# ‘జుడీషియల్ మర్డర్’

కె. బాలగోపాల్ *

**రాజీవ్‌గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చట్టప్రకారం కూడా అన్యాయమైన తీర్పు. నేరనిర్ధారణ చట్టబద్ధంగానే చేసినా మరణదండన విధించడాన్ని హక్కుల ఉద్యమకారులు, ప్రజాతంత్రవాదులు వ్యతిరేకించేవారే. కానీ చాలామందికి బహుశా తెలియని విషయమేమిటంటే ఈ కేసులో సుప్రీంకోర్టు చేసిన నేరనిర్ధారణే అన్యాయమైనది.**



‘రాజీవ్ గాంధీ హత్య కేసు’ అంటున్నాముగానీ 1991 మే 21 నాడు తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో జరిగిన ‘మానవ బాంబు’ పేలుడు ఘటనలో రాజీవ్‌గాంధీయే కాక ఇంకొక 15 మంది చనిపోయారు. అయినప్పటికీ ఆ హత్యాకాండ లక్ష్యం రాజీవ్‌గాంధీని చంపడం మాత్రమే కాబట్టి, ఆయన దేశ మాజీ ప్రధానమంత్రి కాబట్టి, అప్పట్లో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో ఒకవేళ కాంగ్రెస్ పార్టీ గనుక గెలిస్తే మళ్లీ ప్రధానమంత్రి అయ్యేవాడు కాబట్టి ఆ కేసును రాజీవ్‌గాంధీ హత్య కేసుగానే ప్రస్తావించడం జరుగుతున్నది.

ఈ దృష్టి న్యాయస్థానాల వైఖరిని కూడా ప్రభావితం చేసిందని చెప్పక తప్పదు. చనిపోయిన వాళ్లు పెద్దవాళ్లా చిన్నవాళ్లా అన్నది న్యాయస్థానాలు చూడకూడదనీ నేరం ఎవరు చేసినా ఎవరి మీద జరిగినా ఒకేలాగ చూడాలనీ చట్టం అంటుంది. రాజ్యాంగం అంటుంది. అయినప్పటికీ న్యాయస్థానాలు అన్ని సందర్భాలలోనూ అంత సమదృష్టి ప్రదర్శించవు.

శ్రీపెరుంబుదూర్ హత్యాకాండలో ఒకవేళ రాజీవ్‌గాంధీ తప్పించుకొని స్థానిక కాంగ్రెస్ నాయకులో లేక సభకు వచ్చిన ప్రజలో

* మానవహక్కుల కార్యకర్త, హైద్రాబాద్‌లో న్యాయవాది

చనిపోయి వుంటే ముద్దాయిలందరికీ మరణ దండన విధించాలన్న ఆలోచన ఆ కేసును విచారించిన న్యాయమూర్తికి వచ్చి వుండేదా? పాత తీర్పులను సవరించి చట్టాలకు కొత్త వ్యాఖ్యానాలు చేసయినా సరే ముద్దాయిలలో కొందరిని ఉరికంబం ఎక్కించాలన్న ఆలోచన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు వచ్చి వుండేదా?

లేదనుకుంటాను.

అట్లాగని సుప్రీంకోర్టు సాక్ష్యాలను అర్థం చేసుకోవడంలో పూర్తిగా గుడ్డిగా వ్యవహరించిందని కూడా అనలేము. నిజానికి, నేరానికున్న సామాజిక రాజకీయ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటే తప్ప నేరాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేమన్న ప్రజాస్వామిక సూత్రాన్ని సుప్రీంకోర్టు ఈ కేసులో బాగానే అనుసరించింది. చాలా దూరం అన్వయించింది. కానీ చివరిదాకా తీసుకుపోవడానికి ఈ కేసుకు వున్న రాజకీయ ప్రాముఖ్యత ఎక్కడో అడ్డం వచ్చినట్టుంది.

అందువల్ల ఈ కేసులో ముద్దాయిలకు అన్యాయం జరగడమేకాక కొన్ని అవాంఛనీయమైన సూత్రీకరణలకు ఆమోదముద్ర లభించింది. ముద్దాయి హక్కులకు బలం కల్పించే రెండు తీర్పులను ఈ క్రమంలో సుప్రీంకోర్టు తిరగదోడడమేకాక మరొక ముఖ్య విషయంలో గత కాలంలో సుప్రీంకోర్టే ఇచ్చిన అనేక తీర్పులను అసలే పట్టించుకోకుండా సాక్ష్యాన్ని వ్యాఖ్యానించడం ద్వారా ఒక నష్టకరమైన వరవడిని సృష్టించింది.

ఈ విషయాలను వివరించే ముందు శ్రీపెరుంబుదూర్ కేసు వివరాలను కొంచెం తెలుసుకోవడం అవసరం. 1991 మే 21 సాయంత్రం శ్రీపెరుంబుదూర్‌లో రాజీవ్ గాంధీ ఉపన్యసించనున్న బహిరంగసభ దగ్గర థాను అనే ఎల్‌టిటిఇ కార్యకర్త తన నడుముకు బెల్టు బాంబు కట్టుకొని రాజీవ్ గాంధీకి పూలదండ వేసే నెపంతో దగ్గరికి పోయి బాంబు పేల్చడం ద్వారా తనను తాను పేల్చేసుకొని రాజీవ్‌గాంధీని కూడా పేల్చేసింది. ఇద్దరి శరీరాలు తుత్తునియలయిపోయాయి.

వీళ్లిద్దరేకాక ఇంకొక 15 మంది కూడా ఆ పేలుడులో చనిపోయారు. వారిలో ఒకడయిన హరిబాబు థాను సహచరుడే. అతను అప్పటి దాకా తీసిన ఫోటోలన్నీ అతని శవం పక్కన వున్న కెమెరాలో పదిలంగా వున్నాయి. వాటిని డెవలప్ చేసిన పోలీసులకు ఈ కేసులో మొదటి క్లూలు దొరికాయి. వాటిని ఆధారం చేసుకొని ఒక్కొక్క విషయం బయటకు లాగగలిగారు.

ఈ కేసు గురించి పత్రికలు రాసిన వార్తల ద్వారా థాను కాక మరి రెండు పేర్లు బాగా ప్రచారంలోకి వచ్చాయి. వీరిద్దరూ హరిబాబు కెమెరాలో బంధించబడ్డారు. వీరి పేర్లు శివరాసన్, శుభ. రాజీవ్‌గాంధీ హత్యకు వ్యూహకర్త శివరాసన్ అన్న అభిప్రాయం వెంటనే ప్రచారంలోకి వచ్చింది. అతనిని ఎట్లాగయినా పట్టుకోవాలనీ అప్పుడే కేసు పరిష్కారమవుతుందనీ నేరపరిశోధన చేపట్టిన సిబిఐ వారి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) భావించింది. అయితే వాళ్లకు చేజిక్కే పరిస్థితి ఆసన్నమయిందనుకున్నప్పుడు శివరాసన్, శుభ ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. వీరిద్దరే కాదు, మొత్తం 12 మంది ముద్దాయిలు సిబిఐ పోలీసుల చేతికి చిక్కడం కంటే చావడం మేలని భావించి ఆత్మహత్య చేసుకున్నారు. మన పోలీసుల 'నేరపరిశోధన' పద్ధతులకు ఇంతకంటే వేరే సర్టిఫికేట్ అక్కర లేదు.

ఆత్మహత్య చేసుకొని చనిపోయిన ఈ పన్నెండు మంది కంటే ముఖ్యులు మరి ముగ్గురున్నారని సిబిఐ భావించింది. వారు ఎల్‌టిటిఇ అగ్రనేతలు వి. ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల. ఈ కేసులో వీరే ప్రధాన సూత్రధారులని సిబిఐ భావించింది. అయితే వీరు శ్రీలంకలో వున్నారో ఇంకెక్కడ

వున్నారోగానీ మన పోలీసులకు మాత్రం దొరకలేదు.

ఆత్మహత్య చేసుకున్న 12 మంది, దొరకని ముగ్గురు కలిసి మొత్తం 15 మంది నేరవిచారణ తప్పించుకోగా 26 మంది సిబిఐకి దొరికారు. బోనులో నిలబడ్డారు. వీళ్లు సిబిఐ చార్జిషీటు ప్రకారమే ప్రధాన సూత్రధారులూ కారు, ప్రధాన పాత్రధారులూ కారు. రకరకాల రూపాలలో ఎల్‌టిటిఇకి సహరించినవారు, లేదా ఎల్‌టిటిఇ రూపొందించిన పథకంలో చిన్నా చితకా పాత్రలు పోషించినవారు.

కొంచెం చెప్పుకోదగ్గ పాత్ర పోషించిన 12 మంది ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. థాను, హరిబాబు పేలుడులోనే చనిపోయారు. అంటే నేరస్తులలో 14 మంది కేసు విచారణ మొదలుకూడా కాక ముందే చనిపోయారు. ప్రాణానికి ప్రాణమే సమాధానం అని నమ్మేవాళ్లకు సహితం దీనితో సంతృప్తి కలిగి వుండాలి. కానీ పోయిన 14 మందీ పోగా మిగిలన 26 మందికి కూడా మరణదండన విధిస్తే తప్ప పూర్తి న్యాయం జరగదని ఈ కేసును పరిశోధించిన సిబిఐ భావించింది.

సిబిఐ చాలా పెద్ద కేసు తయారు చేసింది. ఎల్‌టిటిఇ అగ్రనేత ప్రభాకరన్ ఆధ్వర్యంలో శివరాసన్‌ది ప్రధాన బాధ్యతగా భారతదేశంలో బీభత్సం సృష్టించడానికి ఏడు బృందాలుగా ఎల్‌టిటిఇ కార్యకర్తలను భారతదేశానికి పంపడం జరిగిందని సిబిఐ అనింది. 1987 నుండి ఈ కుట్ర సాగుతూనే వుందని అనింది. దాని కోసం వాళ్లు మద్రాసులోనూ ఢిల్లీలోనూ ఇళ్లు తీసుకున్నారు. స్థానిక తమిళులతో స్నేహం చేసి వారి ఇళ్లలో కూడా స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక యింట్లో వైర్‌లేస్ సెట్ ఏర్పాటు చేసి శ్రీలంకలోని ప్రభాకరన్ తదితర ఎల్‌టిటిఇ నాయకులతో సంప్రదింపులు కొనసాగించారు. వారు సృష్టించిన బీభత్సంలో భాగమే రాజీవ్‌గాంధీ హత్య. ఒక దశ వరకు శ్రీలంకలో జరుగుతున్న తమిళ ఈలం పోరాటానికి అనుకూలంగా వున్న భారత ప్రభుత్వం 1987 జులై 22 నాడు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ చొరవతో శ్రీలంక ప్రభుత్వంతో ఆ దేశంలో శాంతి నెలకొల్పడానికి సహకరిస్తానని ఒప్పందం చేసుకొని అక్కడికి భారత సైన్యాన్ని పంపించి తమిళులపైన అణచివేత ప్రయోగించిందన్న కోపంతో ఎల్‌టిటిఇ ఈ కుట్రకు పూనుకుందని సిబిఐ తన చార్జిషీటులో అనింది.

అందువల్ల కేసు టాడా చట్టం కింద పెట్టింది. చెన్నైలోని టాడా కోర్టులో కేసు విచారణ జరిగింది. కేసులో ప్రధాన సాక్ష్యం ముద్దాయిలు ఎస్‌పి ర్యాంకు పోలీసు అధికారికి ఇచ్చిన ఒప్పుకోలు. టాడా కింద రెండు నెలల పోలీసు రిమాండు పొందే అవకాశం వుంది కాబట్టి ముద్దాయిలందరినీ సిబిఐ అరవై రోజుల పాటు రిమాండులోకి తీసుకునింది. ఎవరెవరి నుండి ఒప్పుకోళ్లు కావాలనుకుందో వాళ్లందరి దగ్గరా ఒప్పుకోళ్లు తీసుకుంది. ఇప్పుడు ఉరికంబం ఎక్కబోతున్న నలుగురితో సహా మొత్తం 17 మంది ఒప్పుకోలు వాంగ్మూలాలు ఇచ్చారు. వారిలో 13 మంది ఇంక కొన్ని రోజులలో రెండు నెలల రిమాండు గడచిపోతుందనగా ఒప్పుకోళ్లు ఇచ్చారు. అంటే 50 రోజులు పైగా పోలీస్ కస్టడీలో ఉన్న తరువాత ఇచ్చారు.

ఈ కేసులో ప్రధాన సాక్ష్యం ఈ 17 మంది ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలే. ఇవిగాక కొన్ని ఉత్తరాలూ పత్రాలూ అద్దెకు తీసుకున్న ఇళ్ల ఇరుగుపొరుగు ఇచ్చిన సాక్ష్యాలూ ఉన్నాయిగానీ ఈ వాంగ్మూలాలే లేకపోతే ఉరిశిక్ష కాదు కదా, ఏ శిక్ష వేయడానికీ కావలసిన సాక్ష్యం ఈ కేసులో లేదు.

పోలీసు కస్టడీలో ఉన్న ముద్దాయి ఇచ్చే వాంగ్మూలాన్ని (మెజిస్ట్రేట్‌కు ఇస్తే తప్ప) చట్టం మామూలు కేసులలో సాక్ష్యంగా ఒప్పుకోదు. కానీ టాడా కేసులలో ఒప్పుకుంటుంది. టాడా

చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం ఎస్‌పి ర్యాంకుకు తక్కువకాని పోలీస్ అధికారికి ముద్దాయి ఇచ్చే ఒప్పుకోలు ఆ ముద్దాయికి వ్యతిరేకంగానే కాదు, సహ ముద్దాయిలకు వ్యతిరేకంగా కూడా చెల్లుబాటవుతుంది.

దీనిని ఆసరా చేసుకొని సిబిఐ చాలా భారీగా ఒప్పుకోలు సాక్ష్యాలు పెట్టి చెన్నైలోని టాడా ప్రత్యేక కోర్టులో నేరాన్ని 'రుజువు' చేయగలిగింది. ముద్దాయిల ఒప్పుకోలు వాంగ్మూలాలను ఒకదాని పక్కన ఒకటి పెడితే పెద్ద కథే అవుతుంది. అన్ని ఘటనలూ ఒకదానితో ఒకటి అతికి ఒక సమగ్రమైన కుట్రను మనకు చూపిస్తాయి. ఎటొచ్చీ యాభై రోజులు పైగా పోలీసు లాకప్పులో ఉన్న వ్యక్తి పోలీసులకు ఇచ్చే వాంగ్మూలాన్ని ఎంత మేరకు నమ్మవచ్చుననేది ప్రశ్న. టాడా చట్టం సహితం అటువంటి వాంగ్మూలం సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుందంటుందే తప్ప నిర్విచక్షణగా నమ్మమని చెప్పదు.

చెన్నైలోని టాడా ప్రత్యేక కోర్టు సాక్ష్యాన్ని పూర్తిగా నమ్మింది. 1987లో మొదలయిన కుట్ర రాజీవ్‌గాంధీ హత్యతో ముగిసిందని నమ్మి, ఇంత భారీ కుట్రలో భాగమైనందుకు ముద్దాయిలు 26 మందికీ మరణదండన విధించింది. విదేశీ కుట్రదారులు భారత భూభాగంపైన బీభత్సానికీ రక్తపాతానికీ పాల్పడకుండా ఈ తీర్పు ఒక హెచ్చరికగా ఉంటుందన్న ఆశాభావాన్ని ఆ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యక్తం చేశారు. 'తగిన పరిహారం జరిగింది' అని నేరపరిశోధన నిర్వహించిన సిబిఐ ఉన్నతాధికారి కార్తికేయన్ వ్యాఖ్యానించాడు.

అక్కడి నుంచి కేసు సుప్రీంకోర్టుకు పోయింది. అక్కడ జస్టిస్‌లు డి.పి. వాధ్వా, కె.టి. థామస్, మహమ్మద్ ఖాద్రిలతో కూడిన ముగ్గురు జడ్జిల బెంచి ఈ కేసును వినింది. ముగ్గురు న్యాయమూర్తులూ తమ అభిప్రాయాలు విడివిడిగా చెప్పినప్పటికీ జస్టిస్ వాధ్వా తీర్పే ప్రధానమైనది. చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు వేసిన శిక్షను 'జ్యుడీషియల్ మర్డర్' అని సుప్రీం కోర్టులో వాదించిన ముద్దాయిల న్యాయవాది నటరాజన్ అన్నాడు. జస్టిస్ వాధ్వా కూడా నిర్మొహమాటంగా అవుననే ఒప్పుకున్నారు. ఈ ఒక్క విషయంలోనే కాదు, మరికొన్ని ముఖ్యమైన విషయాలలో కూడా సుప్రీంకోర్టు చాలా నిర్మొహమాటంగా ముద్దాయిల వాదనను అంగీకరించింది.

## నేపథ్యాన్ని బాగా చెప్పారు కాని...

సుప్రీంకోర్టు తీర్పు చదివిన వారికెవరికైనా మొట్టమొదట తోచేది అందులో ఎల్‌టిటిఇ గురించి ఒక్క చెడ్డ మాట కూడా లేకపోవడం. కింది కోర్టు చాలా ఘాటైన మాటలు వాడింది. ఎల్‌టిటిఇ పాల్పడిన కుట్ర భారత సార్వభౌమత్వానికి సవాలనింది. ఒక సార్వభౌమ దేశంగా భారత్ తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా అప్పటి దేశ అధినేతను చంపడం క్షమించరాని చర్య అనింది. ఆ నిర్ణయం మంచిదయినా చెడ్డదయినా ఒక విదేశీ టెర్రరిస్టు సంస్థ మన గడ్డమీదనే దానికి ప్రతీకారం తీర్చుకోవడం దేశం మనుగడకే చేటు అనింది.

న్యాయస్థానాలు తీర్పులిచ్చేటప్పుడు ఈ రకమైన ఆవేశానికి లోనుకావడం అవాంఛనీయమైనప్పటికీ అది తరచు జరుగుతుంటుంది. సుప్రీంకోర్టు ఒక మేరకు అందుకు భిన్నంగా తర్కించింది. తీర్పు మొదటి భాగంలో ఘటన పూర్వరంగాన్ని చర్చించిన చోట ఒక గ్రామ కక్షలో చర్య- ప్రతిచర్యలను చర్చించినంత నిష్పాక్షికంగా చర్చించిందని చెప్పవచ్చు. ఇవతల ఉన్నదొక సార్వభౌమ దేశం, అవతల ఉన్నది ఒక విదేశీ టెర్రరిస్టు సంస్థ అన్న స్పృహ లేకుండా ఇరు పక్షాలనూ ఒకటి చేసి చర్చించారని సుప్రీంకోర్టు జడ్జిలపైన మన పాలకులకు కోపం వచ్చి వుండవచ్చును కూడా.

అయితే తీర్పు చివరి భాగానికి పోయేటప్పటికి న్యాయమూర్తులు ఈ స్థిమితాన్ని కోల్పోయినట్లు అనిపిస్తుంది. కేసుకున్న రాజకీయ ప్రాముఖ్యం ప్రభావం అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.

కేసు పూర్వరంగాన్ని సుప్రీంకోర్టు చర్చించిన తీరు చూసిన వారెవ్వరయినా 'మరయితే మీరు వీళ్లకు శిక్ష ఎందుకు వేస్తున్నట్టు' అని ప్రశ్నించకుండా ఉండలేరు. రాజీవ్‌గాంధీ హత్య స్వయంకృతమైన రాజకీయ నిర్ణయాల పర్యవసానంగా కనిపిస్తుందే తప్ప హంతకుల దుర్మార్గం ఫలితమనిపించదు తీర్పులోని తొలి భాగాన్ని చదివితే. అయినప్పటికీ నేరస్తులకు కఠినమైన శిక్ష వేయగలిగారంటే నేరానికి గల పూర్వరంగం ఆ మేరకు నేరస్తుల బాధ్యతను తగ్గిస్తుందని న్యాయమూర్తులు గుర్తించలేకపోయారనైనా అనుకోవాలి, లేదా కేసుకు వున్న రాజకీయ ప్రాముఖ్యం దృష్ట్యా తమ విశ్లేషణను తామే చివరిదాకా తీసుకుపోలేకపోయారనైనా అనుకోవాలి.

శ్రీలంకలోని తమిళప్రాంతాలలో కొంతకాలంగా అశాంతి నెలకొని వుంది. ఆ దేశంలోని మెజారిటీ ప్రజలయిన సింహళ జాతీయులు తమపైన అణచివేతకు పాల్పడుతున్నారని శ్రీలంక తమిళుల అభియోగం. ఈ నేపథ్యంలో శ్రీలంకలోని తమిళుల హక్కుల్ని కాపాడడం కోసం పుట్టిన అనేక సంస్థలలో అగ్రభాగాన నిలబడ్డది ఎల్‌టిటిఇ. తానే తమిళ ప్రజల ఏకైక ప్రతినిధి అని ఎల్‌టిటిఇ అంటోంది. తమిళ ప్రాంతం స్వాతంత్ర్యం కోసం ఎల్‌టిటిఇ శ్రీలంక ప్రభుత్వంపైన సాయుధ పోరాటం మొదలుపెట్టింది. ఈ కారణంగా అశాంతి చెలరేగి భారతదేశంలోకి శ్రీలంక నుండి తమిళ శరణార్థులు రావడం మొదలయింది. 1987 నాటికి సమస్య (బహుశా శరణార్థుల సమస్య అయి వుండాలి) చేయి దాటిపోయే పరిస్థితి ఏర్పడింది. శ్రీలంకలో సాయుధ పోరాటం నిర్వహిస్తున్న ఎల్‌టిటిఇకి భారతదేశంలో చాలా స్వేచ్ఛ లభించింది. సాయుధ శిక్షణ కోసం, గాయపడిన వారికి వైద్యం చేయించుకోవడం కోసం, మందులు తదితర అవసరాల సరఫరా కోసం, డబ్బు వసూలు కోసం, ప్రచురణలు చేపట్టడం కోసం, పెట్రోలు, వైర్‌లెస్ పరికరాలు, బాంబుల సరఫరా కోసం ఎల్‌టిటిఇ భారత గడ్డ మీద స్థావరం ఏర్పరచుకొని శ్రీలంక సైన్యంతో పోరాటం చేసింది.

ఇవి మా మాటలు కావు. భారత సుప్రీంకోర్టు మాటలు. ఎక్కడా 'అట' అనిగానీ 'ఇది అభియోగం' అనిగానీ అనకుండా సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా గుర్తించిన సత్యాలు. ఎల్‌టిటిఇ సాయుధ శిక్షణ భారతదేశంలోనే పొందిందని చెప్పిన చోట ఆ శిక్షణ భారత సైన్యమే ఇచ్చిందన్న ఒక్క మాట సుప్రీంకోర్టు అనలేదుగానీ అదొక్కటి తక్కువగా అన్నీ అనింది. అన్ని విషయాలూ గుర్తించింది.

అంతా సజావుగా సాగుతున్న ఈ దశలో 1987 జూలై 29న అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ చొరవతో భారత-శ్రీలంక ఒడంబడిక జరిగింది. 'మన పొరుగువారయిన శ్రీలంక సోదరులను చాలా ఏళ్లుగా బాధిస్తున్న సాయుధ పోరుకు అంతం పలకడానికి ఈ ఒడంబడిక ఉద్దేశించబడింది' అని రాజీవ్‌గాంధీ పార్లమెంట్‌కు చెప్పాడు. ఈ సాయుధ పోరు శ్రీలంకలో భద్రతకూ సమగ్రతకూ ఏకతకూ భంగకరంగా తయారయిందని అన్నాడు. ఈ ఒడంబడిక ప్రకారం శ్రీలంక ప్రభుత్వం ఉత్తరాన ఉన్న తమిళ ప్రాంతాలలో అమలులో వున్న ఎమర్జెన్సీ ఎత్తివేస్తుంది. ఎన్నికలు నిర్వహిస్తుంది. అధికార వికేంద్రీకరణలో భాగంగా స్థానిక కౌన్సిళ్లను నెలకొల్పుతుంది. తమిళ పోరాటకారులంతా తమ ఆయుధాలు అప్పగించేస్తారు. ఎమర్జన్సీ చట్టాలు, టెర్రరిస్టు చట్టాల కింద బందీలయి వున్న ఖైదీలందరినీ శ్రీలంక ప్రభుత్వం విడుదల చేస్తుంది అని చెప్పారు. ఇవన్నీ జరిగేటట్టు చూసే బాధ్యత భారత్‌ది. అందుకోసం భారతసైన్యాన్ని భారత శాంతి పరిరక్షణ బలగం (ఐపికెఎఫ్) అనే పేరిట శ్రీలంకకు పంపించారు.

భారత ప్రభుత్వం ఒత్తిడి మీద ప్రభాకరన్ (ఎల్‌టిటిఇ అధినేత) కూడా ఈ ఒప్పందం పైన సంతకం పెట్టాడు. తన పోరాటానికతను అప్పట్లో పూర్తిగా భారత దేశం మీద ఆధారపడి వున్నాడు కాబట్టి అతనికి సంతకం చేయక తప్పలేదు.

అయితే త్వరలోనే భారత-శ్రీలంక ఒప్పందం పట్ల ఎల్‌టిటిఇ వ్యతిరేకత పెంచుకుంది. దీనికి గల కారణాలను సుప్రీంకోర్టు సానుభూతితోనే వివరించింది. ముగ్గురు జడ్జిలలో ఒకరయిన జస్టిస్ థామస్ తాను విడిగా రాసిన తీర్పులో 'ఐపికెఎఫ్ శ్రీలంకలో తమిళులపైన అనేక అత్యాచారాలకు పాల్పడింది. ఎల్‌టిటిఇ కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తించింది' అన్నారు. మిగిలిన ఇద్దరు జడ్జిలు (జస్టిస్ ఖాద్రి, జస్టిస్ వాధ్వా) రాసిన తీర్పులలో కూడా ఐపికెఎఫ్ చేసిన అత్యాచారాల గురించి 'అట' అనిగానీ 'ఇది అభియోగం' అనిగానీ ఎక్కడా అనకుండా శ్రీలంక తమిళులు, వివిధ హక్కుల సంఘాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను తమ మాటలలో పునరుద్ఘాటించారు.

భారత-శ్రీలంక ఒడంబడిక పట్ల ఎల్‌టిటిఇ అసంతృప్తి చెందడానికి గల మరొక రెండు కారణాలను కూడా జస్టిస్ వాధ్వా సానుభూతి స్వరంతోనే ప్రస్తావించారు. భారత ఒత్తిడి వల్ల ఆ ఒప్పందంపైన సంతకం చేసిన కారణంగా ఎల్‌టిటిఇ స్వతంత్ర తమిళ ఈలం లక్ష్యాన్ని వదులుకోవలసి వచ్చింది. అది ఆ సంస్థకు మింగుడుపడలేదు. అంతేకాదు, శ్రీలంక ప్రభుత్వం తమిళ శరణార్థులతోనూ ఎల్‌టిటిఇకి చెందిన ఖైదీలతోనూ ఈ ఒప్పందం స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించినప్పుడు భారత ప్రభుత్వం ఏమనకపోవడం సహితం ఎల్‌టిటిఇకి ఆగ్రహం కలిగించిందని జస్టిస్ వాధ్వా అన్నారు.

అయినప్పటికీ ఎల్‌టిటిఇ నేత ప్రభాకరన్ భారతదేశం మీదగానీ భారత ప్రజల మీదగానీ ద్వేషం పెంచుకోలేదనీ ఈ పరిస్థితులకు కర్త అయిన రాజీవ్‌గాంధీ మీద మాత్రమే పెంచుకున్నారనీ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఎల్‌టిటిఇ భారతదేశ సమగ్రతనుగానీ సార్వభౌమత్వాన్నిగానీ ప్రశ్నించినట్లు వారి ప్రచురణలలో ఎక్కడా కనిపించదని అనింది. ఆ ప్రచురణలనూ ప్రభాకరన్ మాటలనూ ఈ అభిప్రాయానికి వత్తాసుగా ఉటంకించింది. 1989లో మన దేశ ప్రధానమంత్రిగా అధికారానికి వచ్చిన వి.పి.సింగ్ ఐపికెఎఫ్‌ను వెనక్కు పిలిపించడాన్ని రాజీవ్‌గాంధీ తీవ్రంగా విమర్శించి, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తే భారత- శ్రీలంక ఒడంబడికను మళ్లీ అమలు చేస్తుందని ప్రకటించాడు. 1991లో జరిగిన మధ్యంతర పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపించడంతో రాజీవ్‌గాంధీ తిరిగి ప్రధాన మంత్రి కాకుండా ఉండాలంటే అతనిని చంపాలని ఎల్‌టిటిఇ నిర్ణయించుకున్నట్లు సుప్రీంకోర్టు నిర్ధారించింది. అంటే భారతదేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ భగ్నం చేసే ఉద్దేశంగానీ భారతప్రజలను భయభ్రాంతులు చేసే ఉద్దేశంగానీ ఎల్‌టిటిఇకి లేవు. రాజీవ్‌గాంధీని చంపే లక్ష్యం మాత్రమే ఉండింది.

రాజీవ్‌గాంధీ తీసుకున్న నిర్ణయం దేశ ప్రధానమంత్రిగా తీసుకున్నది కాబట్టి దానికి ప్రతీకారంగా అతనిని చంపడం ఒక సార్వభౌమ దేశానికి తప్పనిసరిగా ఉండవలసిన నిర్ణయాధికారానికి సవాలుకాదా- అంటే మన దేశ సార్వభౌమత్వాన్ని భగ్నం చేసే చర్య కాదా అని సొలిసిటర్ జనరల్ శ్రీ అల్తాఫ్ అహ్మద్ లేవదీసిన ప్రశ్నకు జవాబుగా, అధికారంలో ఉన్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రతిపక్షాలు ప్రశ్నించడం లేదా, అది దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించడం కిందికి వస్తుందా అని సుప్రీంకోర్టు అనింది. ఈ మాట సుప్రీంకోర్టు జడ్జిలు అన్నారు కాబట్టి సరిపోయింది. వేరే ఎవరయినా దేశంలోని ప్రతిపక్షాల విమర్శను ఎల్‌టిటిఇ హత్యాకాండతో సమానం చేసి మాట్లాడి

ఉంటే దేశభక్తులంతా వారిపైన ఎంతగా విరుచుకుపడి ఉందురో!

## టెర్రరిజమూ కాదు, విచ్ఛిన్నమూ కాదు

ఈ విశ్లేషణ పర్యవసానమేమిటంటే శ్రీపెరుంబుదూర్ హత్య టెర్రరిస్టు చర్య కాదు, విచ్ఛిన్నకర చర్య కాదు. అంటే టాడా కిందికి రాదు. ఒక చర్య టాడా ప్రకారం టెర్రరిస్టు చర్య కావాలంటే దానికి పాల్పడినవారికి భారత ప్రభుత్వాన్ని ఆయుధాల ప్రయోగంతో లొంగదీసుకునే ఉద్దేశమైనా ఉండాలి, లేదా ప్రజలను భీతావహుల్ని చేసే ఉద్దేశమైనా ఉండాలి. శ్రీపెరుంబుదూర్ హత్యాకాండలో ఇవి రెండూ లేవని సుప్రీంకోర్టు నిర్ధారించిన విషయం చూశాం. అది కేవలం ఒక వ్యక్తిని చంపడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న చర్య. అది గతంలో వారికి అతను చేసిన అన్యాయానికి ప్రతీకారం కావచ్చు, లేదా తిరిగి ప్రధానమంత్రిగా ఎన్నికయి అదే పని మళ్లీ చేయకుండా నిలపాలన్న ఆరాటం కావచ్చు. ఏదయినా టాడాలోని నిర్వచనం ప్రకారం అందులో టెర్రరిజం లేదు.

రాజీవ్‌గాంధీని తామే చంపినట్టు ఎల్‌టిటిఇ ఎక్కడా చెప్పుకోకపోవడాన్ని కూడా సుప్రీం కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ , ప్రచారం టెర్రరిజంలో ఒక ముఖ్య అంశమనీ చంపిన తరువాత ఆ విషయాన్ని చెప్పుకోవడం లేదంటే ఆ వ్యక్తిని చంపడం మాత్రమే వారి లక్ష్యం తప్ప తద్వారా సమాజంలో భయాన్నీ భీతినీ పెంచే లక్ష్యం వారికి లేదని అర్థమవుతుందనీ అనింది. ఆ రకంగా చూసినా అది మామూలు హత్యే తప్ప టెర్రరిస్టు చర్య కాదు. హత్య జరిగిన తరువాతి దినం శ్రీలంక నుండి ఎల్‌టిటిఇ పెద్ద లీడర్లలో ఒకరయిన పొట్టు అమ్మన్ శివరాసన్‌కు పంపించిన వైర్‌లెస్ సందేశంలో మనవాళ్లకు సహితం ఈ పని చేసింది మనమేనని చెప్పడం లేదు అన్నాడని చెప్తూ, భారతదేశంతోనూ భారత ప్రజలతోనూ స్నేహ సంబంధాలు కావాలనే ఎల్‌టిటిఇ కోరుకుందనీ, అందువల్ల గుట్టు చప్పుడు కాకుండా రాజీవ్‌గాంధీని చంపాలని నిర్ణయించుకుందనీ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అటువంటి హత్య టెర్రర్ పుట్టిస్తే పుట్టించవచ్చు, కానీ అది ఈ దేశంలో టెర్రర్ పుట్టించే ఉద్దేశ్యంతో చేసిన హత్యకాదు. ఈ దేశాన్నీ ఈ దేశస్తులనూ శత్రువుల్ని చేసుకోకుండా ఒక్క రాజీవ్ గాంధీని మాత్రం తొలగించే లక్ష్యంతో చేసిన హత్య. ఒక నేరం టాడా కిందికి వస్తుందా రాదా అనేదానికి ప్రమాణం దానివల్ల కలిగే పర్యవసానం కాదు, ఆ నేరం చేయడంలోగల ఉద్దేశ్యం. ఉద్దేశ్యంలో ప్రజలను టెర్రరైజ్ చేయాలన్నది ( ప్రభుత్వాన్ని లొంగదీసుకోవాలన్నది) లేనప్పుడు అది టాడా చట్టం ప్రకారం టెర్రరిస్టు చర్యకాదు. అంటే టాడాలోని సెక్షన్ 3 కిందికి రాదు.

అది 'విచ్ఛిన్నకర చర్య' కూడా కాదు. అంటే టాడా చట్టంలోని సెక్షన్ 4 కిందికి కూడా రాదు. ఒక చర్య విచ్ఛిన్నకర చర్య కావాలంటే అది భారతదేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నించే చర్య అయివుండాలి. ఎల్‌టిటిఇకి అటువంటి లక్ష్యమేమీ లేకపోగా భారతదేశంతో స్నేహసంబంధాలనే కోరుకునిందన్న సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ఇప్పటికే చూశాం. కాబట్టి రాజీవ్ గాంధీ హత్య టాడా సెక్షన్ 4 కిందికి కూడా రాదు.

అయితే దేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నించే ఉద్దేశ్యం లేకపోయినా, విద్యుక్త ధర్మంగా దేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ కాపాడే బాధ్యత గల వ్యక్తులను లేక ప్రభుత్వ ఉద్యోగులను చంపితే అది విచ్ఛిన్నకర చర్య అవుతుందని సెక్షన్ 4(3) అంటుంది. దానికిందికైనా రాదా? అని సొలిసిటర్ జనరల్ అల్తాఫ్ అహ్మద్ ఆందోళనగా ప్రశ్నించాడు. ఎందుకంటే ప్రధానమంత్రిగా ఉండిన రాజీవ్‌గాంధీ అటువంటి విద్యుక్త ధర్మం గలవాడు. అంతేకాక శ్రీపెరుంబుదూర్ పేలుడులో రాజీవ్‌గాంధీతో బాటు 9 మంది పోలీస్ అధికారులు చనిపోయారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు.

కాబట్టి సెక్షన్ 4(3) కింద ఈ హత్యాకాండ 'విచ్ఛిన్నకర చర్య' అవుతుందని ఆయన వాదించారు.

ఈ వాదనను కూడా సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. రాజీవ్‌గాంధీ ఒకప్పుడు ప్రధానమంత్రి అయి ఉండవచ్చునుగానీ చనిపోయినప్పుడు కాదు. అప్పుడు కనీసం పార్లమెంటు సభ్యుడు కూడా కాదు. ఎందుకంటే పార్లమెంటు రద్దయిపోయి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక అతనితో బాటు చనిపోయిన పోలీస్ అధికారుల మాటకొస్తే వారిని చంపాలన్న ఉద్దేశం హంతకులకు వుండి వుంటే అది సెక్షన్ 4(3) కిందకి వచ్చేదేగానీ హంతకులు ఉద్దేశించింది రాజీవ్‌గాంధీని చంపాలని మాత్రమే. అతని సమీపంలో ఉన్న కారణంగా వీరు చనిపోయారు.

కాబట్టి ఏ రకంగా చూసినా రాజీవ్‌గాంధీ హత్య టాడా కిందికి రాదని సుప్రీంకోర్టు తీర్మానించింది. ఇందులో ప్రధానంగా ప్రశంసించవలసిన విషయం ఏమిటంటే ఈ దేశ ప్రధాన మంత్రిగా ఉండిన వ్యక్తి ఆ హోదాలో తీసుకున్న నిర్ణయానికి కక్షగట్టి ఒక విదేశీ సంస్థ అతను తిరిగి ఎన్నిక కాకుండా ఉండడం కోసం అతనిని ఈ దేశంలోనే హతమార్చిన కేసులో కూడా న్యాయనిర్ణయానికి హానికరమైన ఆవేశానికీ ఆగ్రహానికీ లోనుకాకుండా స్థిమితంగా తర్కించగలగడం. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఒక మంచి సంప్రదాయాన్ని నిలబెట్టిందనే చెప్పాలి. ఎటొచ్చీ దానిని చివరి దాకా నిలుపుకోలేక పోయింది.

రాజీవ్‌గాంధీని హత్య చేయడం మాత్రమే కాకుండ భారతదేశంలో టెర్రర్ సృష్టించే కార్యకలాపాలకు పాల్పడడం కూడ ఎల్‌టిటిఇ లక్ష్యమన్నది సిబిఐ అభియోగమని పైన చూశాం. ఈ లక్ష్య సాధనకు కుట్ర 1987 నుండి జరుగుతున్నదని సిబిఐ రుజువు చేయబూనుకుంది. అయితే అటువంటి ఆధారాలేవీ ప్రాసిక్యూషన్ చూపించలేకపోయిందనీ ఎల్‌టిటిఇకి అటువంటి ఉద్దేశ్యం లేదని నమ్మడానికే ఎక్కువ ఆధారాలున్నాయనీ సుప్రీంకోర్టు అనింది. రాజీవ్‌గాంధీ హత్య, అందుకోసం జరిగిన కుట్ర అనే రెండు నేరాలు మాత్రమే ఈ కేసులో ఉన్నాయనింది.

ఆ కుట్రలో ఎవరు భాగస్వాములన్న విషయంలో కూడా సుప్రీంకోర్టు చెన్నై టాడా స్పెషల్ కోర్టుతో విభేదించింది. 26 మంది ముద్దాయిలూ అందులో భాగస్వాములేనని నిర్ధారించి అందరికీ మరణదండన విధించింది టాడా స్పెషల్ కోర్టు. సుప్రీం కోర్టు ఒక్కొక్కరి పాత్రనూ విడివిడిగా చర్చించి అందులో 19 మందిని 'కుట్ర' అభియోగం నుండి విముక్తం చేసింది. మిగిలిన ఏడుగురిలో ముగ్గురి మరణదండనను జీవిత ఖైదుగా మార్చింది. నలుగురికి మాత్రం మరణదండన ఖరారు చేసింది. ఆ నలుగురిలో ఒకరైన నళిని విషయంలో జడ్జిలలో ఒకరు (జస్టిస్ థామస్) మిగిలిన ఇద్దరితో విభేదించారు. ఆమెకు కూడా జీవిత ఖైదు చాలన్నాడు. కానీ మిగిలిన ఇద్దరూ ఒప్పుకోలేదు కాబట్టి ఆమెకు కూడా మరణదండన ఖరారయింది.

రాజీవ్‌గాంధీ హత్యకై జరిగిన కుట్రలో ఎవరు ఏ మేరకు భాగస్వాములనే విషయాన్ని చర్చించే క్రమంలో సుప్రీంకోర్టు భారత శిక్షాస్మృతిలో కుట్ర అనే నేరానికి ఉండే అర్థాన్నీ దానిని రుజువు చేసే పద్ధతినీ వివరంగా చర్చించింది. ఆ చర్చనిక్కడ వివరించడం అనవసరంగానీ రాజకీయ మిలిటెన్సీ పైన పెట్టే కేసులలో ముద్దాయిలకు అది ఉపయోగపడగలదని చెప్పడం అవసరం. ఈ విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా చేసిన సూత్రీకరణ ఏదీ లేకున్నా ఒకే చోట ఇంత వివరమైన చర్చ ఉండడం ఉపయోగపడుతుంది. ఇటువంటి కేసులలో రాజకీయ భావసారూప్యత, నిర్మాణంలో భాగస్వామ్యం, నేరం కోసం జరిగిన కుట్రలో పాత్ర కలిగి ఉండడం అనే భిన్న విషయాల మధ్య తేడా చెరిగిపోతుంది. ఈ తేడాను చెరిపేసి చాలామందిని కేసులో ఇరికించాలని పోలీసులు చూస్తారు. న్యాయస్థానాలు ఈ తేడాను లెక్కలోకి తీసుకోక పోయినట్లయితే చాలా అన్యాయం జరిగే ప్రమాదం

వుంటుంది. ఆ జాగ్రత్త నేర్పించడానికి రాజీవ్‌గాంధీ కేసులో సుప్రీం కోర్టు కుట్ర గురించి చేసిన న్యాయసిద్ధాంత విశ్లేషణ ఉపయోగపడుతుంది.

## ఒప్పుకోళ్ల స్వీకారంలో తప్పటడుగు

ఇక్కడిదాకా చాలా జాగ్రత్తగా వ్యవహరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆ తరువాత అంతే అజాగ్రత్తగా న్యాయ సిద్ధాంత సంబంధమైన మెళకువలన్నిటినీ గాలికి వదిలివేయడం ఆశ్చర్యం కలిగించే విషయం. టెర్రరిస్టు చర్య, విచ్ఛిన్నకర చర్య, కుట్ర మొదలయిన న్యాయసిద్ధాంత భావనలను ఈ కేసు సాక్ష్యాలకు ఆచితూచి అన్వయించారుగానీ ఒప్పుకోలు (కన్ఫెషన్) వాంగ్మూలాలను ఏ విధంగా వ్యాఖ్యానించాలన్న విషయంలో కొన్ని దశాబ్దాలుగా సుప్రీంకోర్టు సూచించిన జాగ్రత్తలన్నిటినీ విస్మరించి 'ఒప్పుకున్నావంటే నువ్వు చేశావన్న మాటేనని' ఒప్పుకోలు వాంగ్మూలాలన్నిటినీ పరమసత్యాలుగా స్వీకరించేశారు.

ఈ కేసులో 17 మంది ముద్దాయిలు ఎస్‌పి ర్యాంకు పోలీసు అధికారికి ఒప్పుకోలు ఇచ్చారు. తాము నేరం చేసినట్టు ఒప్పేసుకుంటూ తమ సహ ముద్దాయిల పాత్ర గురించి కూడా చెప్పారు. మొదట్లో చెప్పినట్టు ఈ కేసులోని ప్రధాన సాక్ష్యం ఇదే.

మామూలు కేసులలోనయితే ముద్దాయి పోలీసులకు ఇచ్చే ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. టాడా కేసులో సెక్షన్ 15 ప్రకారం చెల్లుబాటు అవుతుంది. రాజీవ్ గాంధీ హత్య కేసు టాడా చట్టం కింద పెట్టిన కేసు కాబట్టి సిబిఐ ముద్దాయిల వాంగ్మూలాల్ని తానే రికార్డు చేసింది. కేసును విచారించిన టాడా స్పెషల్ కోర్టు ఆ నేరం టెర్రరిస్టు నేరమేనని నమ్మింది కాబట్టి టాడా చట్టంలోని సెక్షన్ 15 కింద ఆ వాంగ్మూలాలను సాక్ష్యంగా స్వీకరించింది. ఒప్పుకోలు ఇచ్చిన ముద్దాయిల పైననే కాక ఆ వాంగ్మూలంలో ప్రస్తావించిన ఇతర సహ ముద్దాయిల పైన కూడా అది సాక్ష్యంగా చెల్లుబాటవుతుందని సెక్షన్ 15 అంటుంది కాబట్టి ఒకరి ఒప్పుకోలును మరొకరి పైన సాక్ష్యంగా కూడా స్పెషల్ కోర్టు స్వీకరించింది. ఆ విధంగా 17 మంది ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను ఆధారం చేసుకొని 26 మందికీ ఉరిశిక్ష విధించేసింది.

కానీ ఈ నేరం టాడా కిందికే రాదని భావించిన సుప్రీంకోర్టు ఆ ఒప్పుకోళ్లను ఎట్లా లెక్కలోకి తీసుకోగలుగుతుంది? రాజీవ్‌గాంధీ హత్య టెర్రరిస్టు నేరం కాదనీ మామూలు నేరమేననీ గుర్తించిన తరువాత మామూలు నేరాలకు వర్తించే న్యాయసూత్రం ప్రకారం పోలీసులకు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సాక్ష్యం నుండి తొలగించి మిగిలిన సాక్ష్యం ఆధారంగా ఏదైనా నిర్ణయానికి రావలసి వుంటుంది. మిగిలిన సాక్ష్యం దాదాపు మృగ్యం కాబట్టి మరణదండన సంగతి దేవుడెరుగు, ఏ దండనా వేయడానికి కావలసిన ఆధారాలు లేవని గుర్తించి ముద్దాయిలందరినీ విడిచి పెట్టవలసి వుంటుంది.

కానీ సుప్రీంకోర్టు చాలా ఆశ్చర్యకరంగా, ఇది టెరరిస్టు నేరం కాదని ఒక వైపు అంటూనే టాడా చట్టంలోని సెక్షన్ 15 కింద నమోదు చేసిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సాక్ష్యంగా పరిగణించింది. అట్లా చేయడానికి వీలు లేదని, ఒకసారి ఆ నేరం టాడా కిందికి రాదని గుర్తించిన తరువాత సెక్షన్ 15 ఇచ్చే అవకాశం ప్రాసిక్యూషన్‌కు ఇక ఉండదని సుప్రీంకోర్టు గతంలో బిలాల్ అహ్మద్ కాలూ వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో (1997) ఇచ్చిన తీర్పు 'తప్పు' అని ఈ ముగ్గురు జడ్జిలు ఇప్పుడు ప్రకటించారు.

దీనికి ఆధారం టాడాలోని సెక్షన్ 12లో వుందని వారు అన్నారు. సెక్షన్ 12 సారాంశాన్ని మామూలు భాషలో చెప్పాలంటే, ఒక టాడా కేసులో అభియోగ పత్రం పెట్టేటప్పుడు ముద్దాయి

పైన టాడా చట్టం కింద అభియోగాలతో పాటు ఇతర సాధారణ చట్టాల కింద అభియోగాలు కూడా (టాడా నేరంతో సంబంధం ఉన్నవి) ప్రాసిక్యూషన్ పెట్టవచ్చు. టాడా ప్రత్యేక కోర్టు అన్నిటినీ కలిపి విచారించి వాటికి కూడ శిక్ష వేయవచ్చు. ఉదాహరణకు ఈ కేసులో రాజీవ్ గాంధీని చంపారన్న అభియోగంతో పాటు దొంగ పాస్‌పోర్ట్‌లు కలిగి ఉన్నారన్న అభియోగం కూడ ముద్దాయిల పైన వుంది. రాజీవ్‌గాంధీ హత్య టాడా కిందికొచ్చే నేరమేననుకున్నా దొంగ పాస్‌పోర్ట్‌లు కలిగి వుండటం టాడా కిందికి రాదు. అది పాస్‌పోర్ట్ చట్టం కింద నేరం. అయినప్పటికీ టాడా కోర్టే రెండింటినీ కలిపి విచారించవచ్చునని సెక్షన్ 12 అంటోంది. అప్పుడు టాడా కింద ఇచ్చిన ఒప్పుకోలును ఆధారం చేసుకొని పాస్‌పోర్టు చట్టం కింద కూడా శిక్ష వేయవచ్చును. అదే విధంగా, టాడా కింద ఒక కేసు విచారించే క్రమంలో ముద్దాయి వేరే నేరాలు చేసిన సంగతి కూడా ప్రత్యేక కోర్టు దృష్టికి వస్తే ఆ కోర్టు వాటి మీద కూడ తానే అభియోగం మోపి విచారించవచ్చు. అప్పుడు కూడా టాడా కింద నమోదయిన ఒప్పుకోలు వాంగ్మూలాలు ఈ నేరాలకు సాక్ష్యంగా పని చేస్తాయి.

టాడా కింద కేసంటూ ఉంటే, దానితో కలగలిసి వున్న వేరే నేరాన్ని టాడా కోర్టు టాడా కేసుతో పాటు అదే పద్ధతిలో విచారించవచ్చుననడంలో కొంత అర్థమేమైనా ఉందేమో (సెక్షన్ 12 భావం అదే) కానీ టాడా కింద నేరమేదీ జరగలేదనీ, జరగిన నేరం సాధారణ నేరస్మృతి కిందనేననీ నిర్ధారించిన తరువాత ఇంక సెక్షన్ 12 ఏ విధంగా వర్తిస్తుంది? వర్తించేటట్టయితే, అసలు ఏ టెర్రరిస్టు స్వభావం లేని నేరాన్ని పోలీసులు కావాలని టాడా కింద బుక్ చేయవచ్చు. దానితో పాటు ఇతర సంబంధిత సెక్షన్‌లు కూడా పెట్టవచ్చు. ముద్దాయి నుండి తామే ఒప్పుకోలు వాంగ్మూలం తీసుకొని దానిని సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చు. అంతా అయిపోయిన తరువాత టాడా స్పెషల్ కోర్టు కేసులో టెర్రరిస్టు నేరమేదీ లేదని చెప్పి ఒప్పుకోలు వాంగ్మూలం ఆధారంగా ఇతర నేరాలకు శిక్ష వేసేయవచ్చు. అంటే సాధారణ నేరాల విచారణలో సాక్ష్యంగా చెల్లుబాటు కాని పోలీసులకిచ్చిన ఒప్పుకోలును ఈ రూపంలో సాక్ష్యంగా చెల్లుబాటు చేసేసుకోవచ్చు. దొడ్డిదారిన ఈ పని చేయడం ఈ తీర్పుప్రకారం చట్టబద్ధం అయిపోతుంది. కానీ 'ప్రత్యక్షంగా' చేయరాని పని పరోక్షంగా చేయడానికి వీలులేదు అనేది ఒక ప్రాథమిక న్యాయసూత్రం.

సెక్షన్ 12కు సుప్రీంకోర్టు ఇచ్చిన చాలా సందేహాస్పదమైన వ్యాఖ్యానాన్ని రేపెప్పుడైనా ఇదే కోర్టు వెనక్కి తీసుకోవచ్చు. కానీ అప్పటికి మరణదండన విధించబడ్డ ఈ నలుగురూ వుండరు. అందువల్ల ముద్దాయిల తరపున ఈ తీర్పుపైన రివ్యూ పిటిషన్ వేసి ఈ వ్యాఖ్యానాన్ని పున:పరిశీలించమని కోరవలసి వుండింది. రివ్యూ పిటిషన్ వేయడమయితే జరిగిందిగానీ అందులో సెక్షన్ 12కు ఇచ్చిన వ్యాఖ్యానాన్ని పున:పరిశీలించమన్న అభ్యర్థన లేదు. కేవలం మరణదండనను పున:పరిశీలించమన్న అభ్యర్థన వుంది. అందువల్ల ప్రస్తుతానికి ఈ వ్యాఖ్యానమే చట్టం.

పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను చెల్లుబాటు చేయడం కోసం బిలాల్ అహ్మద్ కాలూ కేసు తీర్పును తిరగదోడినట్టే, ఒకరి ఒప్పుకోలు నుండి వేరొకరి నేరాన్ని సహితం రుజువు చేయడం కోసం 'కల్పనాథ్ రాయ్' కేసు తీర్పును కూడా సుప్రీంకోర్టు తిరగదోడింది. సాధారణ నేరాలలో ముద్దాయి పోలీసులకు ఇచ్చిన ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదని చూశాము. పోలీసు కస్టడీలో ఉండగా ఇతరులకు ఇచ్చిన ఒప్పుకోలు కూడ చెల్లుబాటు కాదు. కానీ ఆ ఒప్పుకోలు మేజిస్ట్రేట్‌కు ఇస్తే మాత్రం అది సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుంది. అయితే అందులో ముద్దాయి తన నేరం గురించి తాను చెప్పుకునేది మాత్రమే చెల్లుబాటు అవుతుంది. నేరం చేయనివారు చేసినట్టు స్వచ్ఛందంగా ఒప్పుకోరు కాబట్టి స్వచ్ఛందంగా ఒప్పుకోవడం అంటూ

జరిగితే ఆ ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించవచ్చునని చట్టం భావిస్తుంది. కానీ తనతో పాటు తోటి ముద్దాయిలను కూడా ఇరికిస్తే, వారిని ఇరికించే విషయాలు చట్టం కళ్లలో సాక్ష్యంకావని భారత సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 30 అంటుంది. ఇతర సాక్ష్యమేదైనా ఉన్నట్టయితే దానికి బలం చేకూర్చే విషయంగా దీనిని పరిగణనలోకి తీసుకోవచ్చునుగానీ దానంతటది సాక్ష్యంకాదు. ఉదాహరణకు ఒక హత్య కేసులో మొదటి ముద్దాయి మేజిస్ట్రేట్‌కు ఒప్పుకోలు ఇస్తూ 'హతుడిని నేనే పొడిచాను. నాకు కత్తి రెండవ ముద్దాయి అందిచ్చాడు' అని చెప్తే ఇందులో మొదటిది మాత్రమే సాక్ష్యంగా గుర్తించబడుతుంది. రెండవది కాదు. ఆ రెండవ ముద్దాయి కత్తిని నిజంగానే అందిచ్చాడని రుజువు చేసే వేరే ఆధారమేదైనా వుంటే దానికి బలం చేకూర్చే విషయంగా మొదటి ముద్దాయి ఒప్పుకోలులోని రెండవ వాక్యాన్ని కోర్టు లెక్కలోకి తీసుకోవచ్చు.

టాడా విషయం వేరే. సెక్షన్ 15 ప్రకారం మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన ఒప్పుకోలేకాక పోలీసులకు (ఎస్‌పి ర్యాంకు అధికారికి) ఇచ్చిన ఒప్పుకోలు సహితం సాక్ష్యంగా చెల్లుబాటు కావడమే కాదు. ఆ ఒప్పుకోలు ఇచ్చిన ముద్దాయికి వ్యతిరేకంగానే కాక అతని సహ ముద్దాయిలకు వ్యతిరేకంగా కూడా అది సాక్ష్యంగా చెల్లుబాటవుతుందని సెక్షన్ 15 అంటుంది. అంటే టాడా కేసు ముద్దాయి 'ఆ హత్య నేను చేశాను. నాతోబాటు ఫలాన వ్యక్తి కూడా చేశాడు' అని తన సహ ముద్దాయిని ఇరికిస్తూ ఒప్పుకోలు ఇస్తే అది అతనికి వ్యతిరేకంగానే కాక ఆ సహముద్దాయికి వ్యతిరేకంగా కూడా సాక్ష్యంగా చెల్లుబాటవుతుంది.

సాధారణ దృక్పథానికి కూడా ఇది అన్యాయంగా తోస్తుంది. దీనిని వ్యాఖ్యానించే అవకాశం సుప్రీంకోర్టుకు కల్పనాథ్‌రాయ్ కేసులో వచ్చింది. కల్పనాథ్‌రాయ్ ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు. ఇప్పుడే పార్టీలో ఉన్నాడోగానీ ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉండేవాడు. బందిపోట్లకు ఆశ్రయం ఇచ్చినందుకో ఏమోగానీ అతనిపైన టాడా కేసు పెట్టారు. ఇతర ముద్దాయిలు సెక్షన్ 15 కింద పోలీసు అధికారికి ఇచ్చిన ఒప్పుకోలులో చెప్పిన విషయాలు కల్పనాథ్‌రాయ్‌కి వ్యతిరేకంగా సాక్ష్యంగా చెల్లుబాటవుతాయా అన్న ప్రశ్న సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. సెక్షన్ 15 చెల్లుబాటవుతాయనే అంటుంది కానీ సుప్రీంకోర్టు సెక్షన్ 15ను చాలా కుదించి వ్యాఖ్యానించింది. ముద్దాయి ఇచ్చిన ఒప్పుకోలు అతనికి వ్యతిరేకంగా చెల్లుబాటవుతుంది కానీ సహముద్దాయి విషయానికొచ్చేసరికి సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 30కీ టాడాలోని సెక్షన్ 15 కూ తేడా ఏమీ లేదని అనింది. అంటే సహముద్దాయికి సంబంధించినంత వరకు ఆ ఒప్పుకోలు సాక్ష్యం కాదు. ఇతర సాక్ష్యమేమైనా వుంటే దానికి బలం చేకూర్చగలుగుతుందేమోగానీ అంతకంటే దానికి విలువ లేదు.

ఆ తీర్పు కల్పనాథ్‌రాయ్‌ని కాపాడిందేమోగానీ ఇప్పుడు రాజీవ్‌గాంధీ హత్య కేసులో ప్రాసిక్యూషన్ అభియోగాన్ని రుజువు చేయడానికి అది అడ్డం వచ్చింది. ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలలో వారికి వ్యతిరేకంగా ఉన్న విషయాలను మాత్రమే సాక్ష్యంగా పరిగణించి తక్కిన వారిపైన చెప్పినవి పక్కన పెట్టేట్టయితే కేసు రుజువు కావడం కష్టం. అయితే ముగ్గురు జడ్జిలలో ఇద్దరు (జస్టిస్ వాధ్వా, జస్టిస్ ఖాద్రి) కల్పనాథ్‌రాయ్ కేసు తీర్పును తిరగదోడడానికి సిద్ధపడ్డారు. సెక్షన్ 15లో ఏం చెప్పి వుందో అదే దాని అర్థంగానీ, దానిని కుదించి వ్యాఖ్యానించడం తప్పని అన్నారు. మూడవ జడ్జి అయిన జస్టిస్ థామస్ కల్పనాథ్‌రాయ్ కేసు తీర్పు ఇచ్చిన ఇద్దరు జడ్జిలలో ఒకరు కాబట్టి దానిని తిరగదోడడానికి ఆయన సిద్ధపడలేదు. అయినప్పటికీ మెజారిటీ సిద్ధపడ్డారు కాబట్టి ఆ సవరణ జరిగిపోయింది.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే రెండు పాత తీర్పులను (బిలాల్ అహ్మద్ కాలూ కేసు, కల్పనాథ్ రాయ్ కేసుల తీర్పులను) సుప్రీంకోర్టు తిరగదోడి అవి చేసిన సూత్రీకరణలను తిరస్కరించి ఈ

కేసులో 17 మంది ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సంపూర్ణంగా సాక్ష్యంగా స్వీకరించింది. అదే లేకపోతే ఈ కేసులో దాదాపు సాక్ష్యమే లేదు. చాలా సందేహాస్పదమైన ఈ చర్య ద్వారా రుజువు అయిన నేరానికి ఇప్పుడు నలుగురు ముద్దాయిలు ఉరికంబం ఎక్కబోతున్నారు.

సుప్రీంకోర్టు వైఖరిలోని అభ్యంతరంమైన విషయం ఇదొక్కటే కాదు. పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలం టాడా కేసులలో సూత్రప్రాయంగా సాక్ష్యంగా చెల్లుబాటయినంత మాత్రాన దానిని నిర్విచక్షణగా విశ్వసించమని ఎక్కడా లేదు. ఏ ఒప్పుకోలయినా సరే- అది పోలీసులకిచ్చినా, మేజిస్ట్రేట్‌కు ఇచ్చినా- పూర్తిగా స్వచ్ఛందంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా ఇస్తేనే విశ్వసించాలి. సాధారణ కేసులలో పోలీసు కస్టడీలో వున్న ముద్దాయి మేజిస్ట్రేట్‌కు ఇచ్చే ఒప్పుకోలే సాక్ష్యంగా చెల్లుబాటవుతుందికానీ పోలీసులకుగానీ ఇతర వ్యక్తులకుగానీ ఇచ్చే ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. అదీ స్వచ్ఛందంగా ఇచ్చినదా కాదా అని నిర్ణయించడానికి కావలసిన ప్రమాణాలను చట్టం నిర్దేశించడమేకాక అనేక కేసులలో సుప్రీంకోర్టు కూడా వివరించింది. ఆ ప్రమాణాలే టాడా కేసులలో పోలీసు అధికారికి ఇచ్చే వాంగ్మూలానికి కూడా వర్తిస్తాయని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కర్తార్ సింగ్ కేసులో అనింది.

రాజీవ్‌గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు (అదృష్టం కొద్దీ) ఆ అభిప్రాయాలనుగానీ ఆ ప్రమాణాలనుగానీ తిరగదోడలేదు. వాటిని తిరస్కరించలేదు. కేవలం వాటిని విస్మరించి ఒప్పుకోలు సాక్ష్యాల ప్రామాణికతకు ఆధారాలేమీ అక్కరలేనట్టు వ్యవహరించింది. ఈ కేసులో ఒప్పుకోలు ఇచ్చిన వారంతా దీర్ఘకాలం పోలీసు రిమాండులో వున్న తరువాత నేరుగా ఒక ఎస్‌పి ర్యాంకు అధికారి దగ్గరికి తీసుకుపోబడ్డారు. అతనికి వాంగ్మూలం ఇచ్చేశారు. పోలీసు కస్టడీ నుండి నేరుగా వెళ్లి ఒక మేజిస్ట్రేటు దగ్గర ఇచ్చిన ఒప్పుకోలును సహితం విశ్వసించలేమని గతంలో సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో చెప్పి వుంది. కొంత సమయమైనా పోలీసుల ఒత్తిడి లేకుండా గడిపిన తరువాత ఇచ్చిన వాంగ్మూలమైతేనే విశ్వసించవచ్చునని చెప్పి వుంది. ఇటువంటి ప్రమాణాలేవీ ఇప్పుడు అక్కర లేకుండా పోయాయి.

ఒప్పుకోలు ఇచ్చిన తరువాత ముద్దాయిలందరూ తమ చేత పోలీసులు బలవంతంగా వాంగ్మూలం తీసుకున్నారని కోర్టులో చెప్పారు. ఈ విధంగా 'వెనక్కి తీసుకున్న ఒప్పుకోలు'కు సాక్ష్యంగా పెద్దగా బలం లేదని కూడా గతంలో అనేక తీర్పులలో సుప్రీంకోర్టు చెప్పి వుంది. అదికూడా ఇప్పుడొక పనికి రాని సూత్రీకరణ అయింది. ఆ తీర్పులు 'చెల్లవు' అనకుండానే వాటిని సుప్రీంకోర్టు పూర్తిగా విస్మరించింది.

మొత్తం మీద అన్ని ప్రమాణాలనూ కాదని ఈ 17 ఒప్పుకోలు వాంగ్మూలాలనూ సంపూర్ణంగా విశ్వసించి, 26 మంది ముద్దాయిలలో ఏడుగురు కుట్రదారులేనని సుప్రీంకోర్టు నిర్ణయించింది.

## కుట్ర ఉంటే మాత్రం ఉరి దేనికి?

ఈ నిర్ణయం సరయినదేననుకున్నా, అందులో నలుగురికి ఉరిశిక్ష ఎందుకు వేయాలి? హత్యకు సాధారణంగా జీవిత ఖైదు మాత్రమే విధించాలనీ ఒక మినహాయింపుగా మాత్రమే మరణదండన విధించవచ్చుననీ చట్టం అంటుంది. ఆ మినహాయింపు అరుదయిన వాటిలోకే అరుదైన ఘటనలలో మాత్రమే ఇవ్వాలని కూడా సుప్రీంకోర్టు అనింది. నళిని, మురుగన్, శంతన్, అరివుల నేరం అంత 'అరుదయిన'దని సుప్రీంకోర్టు ఎందుకు భావించింది?

తీర్పు ఇచ్చిన ముగ్గురు జడ్జిలు మురుగన్, శంతన్, అరివుల విషయంలో ఏకాభిప్రాయం కలిగి వున్నారు. జస్టిస్ థామస్ నళిని తన అమాయకత్వం వల్ల మురుగన్ మీద ఉన్న ప్రేమ వల్ల ఈ కుట్రలో ఇరుక్కుందని నమ్మి ఆమెకు జీవిత ఖైదు వేస్తే సరిపోతుందని అన్నారుగానీ మిగిలిన ఇద్దరూ ఒప్పుకోలేదు. ఆమె స్త్రీ కాబట్టి అంతటి క్రూరత్వాన్ని ఆమెకు ఆపాదించలేమన్న వాదనకు జవాబుగా ఈ కేసులో 'మానవ బాంబు'గా వ్యవహరించిన థాను స్త్రీయే, శివరాసన్‌తో పాటు నేరంలో ప్రధాన పాత్ర వహించిన శుభ కూడ స్త్రీయేననీ అందువల్ల వీరిని 'స్త్రీలు' అని మామూలుగా చూసే దృష్టితో చూడకూడదనీ జస్టిస్ వాధ్వా అన్నారు. ఆమెనూ మురుగన్‌నూ ఇద్దరినీ ఉరితీస్తే వాళ్ల పాప అనాథ అవుతుందన్న వాదనకు జవాబుగా వాళ్లు పేల్చిన బాంబు వల్ల ఎన్ని కుటుంబాలు అనాథలు కాలేదని జస్టిస్ వాధ్వా అన్నారు. నళిని, మురుగన్‌ల బిడ్డ ప్రస్తావనకు స్పందిస్తూ వారు పేల్చిన బాంబు వల్ల చనిపోయిన వారిలో కోకిల అనే చిన్న పాప కూడా వుందనీ ఆ అమ్మాయి రాజీవ్‌గాంధీకి కవిత చదివి వినిపిద్దామని తన తల్లితో పాటు వచ్చిందనీ తల్లీబిడ్డలిద్దరూ థాను పేల్చిన బాంబులో చనిపోయారనీ ఆయన జ్ఞాపకం చేశారు.

మొత్తానికి శిక్ష గురించి న్యాయమూర్తులయినా సాధారణ పౌరులయినా చేసే ఆలోచన ప్రతీకార భావనకు పెద్దగా దూరం ఉండదని జస్టిస్ వాధ్వా మరొక్కసారి రుజువు చేశారు. న్యాయం నేరస్తుల స్థానంలో తాను కూడా నిలబడి 'వాళ్లంతా క్రూరంగా ప్రవర్తించినప్పుడు నేను క్రూరంగా శిక్షిస్తే తప్పేముంది' అంటుంది. ఇది అనాగరికమైన ఆలోచన అని గుర్తిస్తే తప్ప జస్టిస్ వాధ్వా వాదనలో తప్పేమిటో అర్థం కాదు.

ఇకపోతే ఈ నేరం 'అరుదయిన వాటిలోకే అరుదయినది' ఎందుకయిందంటే చాలా పకడ్బందీగా పథకం వేశారు, నిర్దాక్షిణ్యంగా అమలు చేశారు. రాజీవ్‌గాంధీ పక్కన ఇతర ప్రజలు ఉంటారని తెలిసి కూడ చాలా శక్తివంతమైన బాంబు వాడి మరొక 15 మందిని చంపారు. అన్నిటి కంటే ముఖ్యంగా దేశ ప్రధానమంత్రి హోదాలో మెజారిటీ వోటర్లు ఎన్నుకున్న పార్టీనాయకుడి హోదాలో తీసుకున్న నిర్ణయానికి రాజీవ్‌గాంధీని బలి చేశారు.

రాజీవ్‌గాంధీ హత్య టాడా కిందికి వస్తుందా రాదా అన్న చర్చ చేసినప్పుడు లెక్కలోకి తీసుకున్న రాజకీయ నేపథ్యాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇక్కడ పూర్తిగా మరిచిపోయారు. 1987లో భారత ప్రభుత్వం తమిళ ఈలం పోరాటం పట్ల అప్పటి దాకా అమలు చేసిన విధానాన్ని అకస్మాత్తుగా మార్చుకోవడం వల్ల ఆ పోరాటానికి కలిగిన నష్టాన్ని, ఐపికెఎఫ్ శ్రీలంకలో తమిళుల పైన పాల్పడిన అణచివేత, అత్యాచారాల పట్ల శ్రీలంక తమిళులలో కలిగిన న్యాయమైన ఆగ్రహాన్ని, తాను తిరిగి ప్రధానమంత్రి అయినట్టయితే వి.పి.సింగ్ వెనక్కి పిలిపించిన ఐపికెఎఫ్‌ను తిరిగి శ్రీలంకకు పంపిస్తానని ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజీవ్‌గాంధీ చేసిన ప్రకటన వారిలో కలిగించిన ఆందోళనను లెక్కలోకి తీసుకుంటే తప్పంతా వారి మీదనే పెట్టి వారిని ఉరి తీయవలసిందేనని సుప్రీంకోర్టు అనగలిగి వుండేది కాదు.

✦